# నికాహ్‌లోని రకాలు

**15వ అంశం** నికాహ్ నాలుగు రకాలు:

1) నికాహ్ మస్నూన్ 2) నికాహ్ షిఘార్

3) నికాహ్ హలాలా 4) నికాహ్ ముతా

## 1. మస్నూన్ నికాహ్ (సంప్రదాయబద్ధమైన వివాహం)

**16వ అంశం** ప్రధాన సంరక్షకుని ఆధ్వర్యంలో జీవితాంతం తోడూ నీడగా ఉండే సంకల్పంతో చేసుకునే నికాహ్ మస్నూన్ నికాహ్ అనబడుతుంది. ఈ నికాహ్ ధర్మసమ్మతం.

**17వ అంశం** తన భర్త తప్ప ఇతర పురుషులతో కలసిమెలసి ఉండే విధానాలన్నీ అధర్మం.

**18వ అంశం** స్త్రీ ఏక కాలంలో ఒకరికన్నా ఎక్కువ మంది పురుషులను వివాహమాడే పద్ధతిని ఇస్లాం హరామ్ (అధర్మం, నిషిద్ధం)గా ఖరారు చేసింది.

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం అజ్ఞాన కాలంలో నాలుగు రకాల వివాహాలు జరిగేవి. మొదటి పద్ధతి మామూలే. దాని ప్రకారం నేటికీ జనులు వివాహ సందేశం పంపిస్తున్నారు. అంటే ఒక పురుషుడు మరో పురుష సంరక్షకుని (వలీ)కి అతని కూతురి కోసమో, లేక మరో స్త్రీ కోసమో వివాహ సందేశం పంపుతాడు. ఆ వ్యక్తి (వలీ) 'మహర్' సొమ్మును నిర్ణయించి (తన కుమార్తె లేక తన సంరక్షణలో వున్న స్త్రీతో) అతని వివాహం జరిపిస్తాడు. రెండవ పద్ధతి ప్రకారం: ఒక స్త్రీ రుతుస్రావం నుంచి పరిశుద్ధత పొందిన తరువాత ఆమె భర్త ఆమెనుద్దేశించి, నీవు ఫలానా వ్యక్తి (పరాక్రమశాలి, అందగాడు, ఉన్నత వంశస్థుణ్ణి)ని పిలిచి అతనితో రమించు అంటాడు. ఆమె ఆ వ్యక్తితో రమించి, ఆమె గర్భవతి అని నిర్ధారణ అయ్యేవరకూ ఆమె భర్త ఆమెకు దూరంగా ఉండేవాడు. గర్భవతి అని స్పష్టంగా తేలిన తర్వాత భర్త తాను కోరితే ఆమె వద్దకు పోయేవాడు. ఇంతకీ ఇలా ఎందుకు చేయబడేదంటే ఉన్నత కుటుంబీకుల ద్వారా అందమైన సంతానం కలగాలని వారు కోరుకునేవారు. ఈ రకమైన నికాహ్‌ను 'నికాహె ఇస్తిబ్‌జా' అనేవారు.[1]

1. ఈ రకమైన అజ్ఞాన చేష్టకు పూర్వం భారతదేశంలో కూడా ఒడిగట్టేవారు. దీన్ని 'నియోగ్'గా వ్యవహరించేవారు.

teluguislam.net



మూడవ పద్ధతి ప్రకారం; పది మంది వరకు పురుషులు కలిసి ఒక స్త్రీతో లైంగిక సంబంధం ఏర్పరచుకునేవారు. ఆ స్త్రీ గర్భవతి అయి, శిశువును కన్న మీదట, ఆ పురుషులందరినీ పిలిపిస్తుంది. ఆమె ఆహ్వానాన్ని నిరాకరించే సాహసం ఎవరికీ ఉండదు. వారంతా తన ఇంటికి వచ్చిన తరువాత, ఆమె వారితో ఇలా అంటుంది: 'మీరంతా నాతో ఎలా వ్యవహరించారో మీకు బాగా తెలుసు. ఇదిగో, నేను ఈ శిశువును కన్నాను. ఓ ఫలానా వాడా! వీడు నీ బిడ్డ" . ఆ స్త్రీ ఏ మగవాని పేరుతో పిలిస్తే ఆ బిడ్డ చట్టపరంగా అతనిదే. 'కాదు, కూడదు' అనే ధైర్యం ఆ మగవాడికి ఉండదు. నాల్గవ పద్ధతి : దీని ప్రకారం ఒక స్త్రీ వద్దకు చాలా మంది వస్తూపోతుంటారు. ఆమెతో వ్యభిచరిస్తారు. ఆమె ఎవరినీ కాదనదు. వారు వేశ్యలనబడేవారు. దానికి గుర్తుగా ఇంటికప్పుపై ఒక జెండా ఉండేది. కోరిన వారు రావచ్చని దాని భావం. ఆమె గర్భవతి అయి, శిశువును కన్నప్పుడు ఆమెతో వ్యభిచారం చేసిన పురుషులంతా కలసి జన్యుపరంగా ఆ శిశువు ఎవరి సంతానమో నిర్ధారించే ప్రవీణుడ్ని పంపిస్తారు. ఆ వ్యక్తి ఏ మగవాడి వైపు ఆ శిశువును పంపిస్తే అది అతని సంతానంగానే ఖరారవుతుంది. తిరస్కరించే అధికారం ఆ మగవాడికి ఉండదు. మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇస్లాం ధర్మం తీసుకువచ్చాక, అజ్ఞానంతో కూడిన అక్రమ వివాహ పద్ధతులన్నింటినీ ఆయన (స) అధర్మం (హరామ్)గా ఖరారు చేసి నేడు చెలామణిలో ఉన్న 'నికాహ్'ను సమ్మతించి ఆమోదించారు." ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[1]

## 2. నికాహ్ షిఘార్ (మారకపు నికాహ్)

**19వ అంశం** తన కూతురినో లేక తన చెల్లినో మరొకరికిచ్చి పెళ్లి చేయాలనుకున్నప్పుడు అతను కూడా అతని కూతురినో లేక చెల్లినో తనకిచ్చి నికాహ్ జరిపించాలని షరతు విధించటం లేదా ఒకరి అమ్మాయిని కోడలిగా తెచ్చుకుని తమ కూతురిని కూడా ఆ ఇంటి కోడల్ని చేసుకోమని చెప్పటం- ఈ రకమయిన నికాహ్ వారించబడింది.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (స) మారకపు నికాహ్ నుండి వారించారు. ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[2]

## 3. హలాలా నికాహ్

**20వ అంశం** అస్గర్ తన భార్య అయిన అస్గరీకి మూడు విడాకులు ఇచ్చిన తరువాత మళ్ళీ ఆమెను పెళ్ళి చేసుకునేందుకు అక్బర్‌తో ఆమె

1. కితాబున్నికాహ్- బాబు మన్ లా నికాహ ఇల్లా బివలియ్యిన్
2. కితాబున్నికాహ్- బాబు షిఘార్.

పెళ్ళి జరిపిస్తాడు. పెళ్ళయిన రెండు మూడు రోజులకు ఆమెకు విడాకు లివ్వాలని ముందుగానే షరతు పెడతాడు. ఆ తరువాత అస్గర్ తన మాజీ భార్య (అస్గరీ)ని పునర్వివాహం చేసుకుంటాడు. ఇటువంటి నికాహ్‌ను 'హలాలా' అంటారు. ఇటువంటి నికాహ్ షరీయత్ ప్రకారం ముమ్మాటికీ అధర్మం (హరామ్).

**21వ అంశం** హలాలా చేసేవాడు, చేయించేవాడు - ఇద్దరూ శాపగ్రస్తులే.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) 'హలాలా' చేసేవారు, చేయించేవారు - ఇరువురినీ శపించారు. (తిర్మిజీ-1120 సహీహ్)[1]

## 4. ముతా వివాహం

**22వ అంశం** విడాకులు ఇచ్చే ఉద్దేశంతో పరిమిత గడువు (కొన్ని గంటలు లేక కొన్ని రోజులు లేక కొన్ని వారాలు) కొరకు ఏ స్త్రీనయినా మహర్ నిర్ధారించి పెళ్ళి చేసుకోవటం 'ముతా వివాహం' అనబడుతుంది.

హజ్రత్ రబీ బిన్ సబ్రహ్ జుహనీ (రజి) కథనం : తన తండ్రి ఒక ప్రకటనలో దైవప్రవక్త (స) ఈ విధంగా చెప్పారని తెలిపారు. దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఓ ప్రజలారా! నేను స్త్రీలతో ముతా వివాహం చేసుకోవటానికి అనుమతి ఇచ్చి ఉన్నాను. అయితే ఇప్పుడు అల్లాహ్ ప్రళయదినం వరకూ దీనిని నిషిద్ధం (హరామ్) గావించాడు. కాబట్టి ఈ విధమైన స్త్రీ ఎవరి వద్దయినా ఉంటే ఆమెను విడిచిపెట్టండి. ఆమెకు ఇచ్చిన దానిని వాపసు తీసుకో వద్దు." ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[2]

వివరణ: గమనార్హమైన విషయమేమంటే మక్కా విజయానికి పూర్వం ముతా వివాహం ధర్మసమ్మతంగా ఉండేది. మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త (స) దీనిని నిషేధించారు. ఈ సంగతి తెలియని కొంతమంది ప్రవక్త సహచరులు (రజి) 'ముతా' ధర్మ సమ్మతమేనని భావించేవారు. కాని హజ్రత్ ఉమర్ (రజి) తన ఖిలాఫత్ కాలంలో ఈ చట్టాన్ని చాలా కఠినంగా అమలుపరచటంతో సహాబా (రజి) అందరికీ 'ముతా' నిషిద్ధం అన్న సంగతి తెలిసివచ్చింది. ఆ తరువాత ఎవరూ దీనిని ధర్మసమ్మతంగా పరిగణించలేదు.

1. సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్బానీ- మొదటి భాగం : హ.నెం. 894
2. కితాబున్నికాహ్ - ముతా వివాహ అధ్యాయం